www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 17 జనవరి 2023

5

అన్నమయ్య

పీలేరు సబ్ జైలు వద్ద కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబునాయుడు

సిరులు కురిపిస్తున్న కెపి ఉల్లి

కెపి (కృష్ణాపురం) ఉల్లి ధరలు మరింత ఘాటుగా ఉండటంతో సాగు చేసిన రైతులకు ఈ ఏడాది సిరులు కురిపిస్తున్నాయి. రెండేళ్ల కంటే అధిక ధరలు పలుకుతున్నాయి. ఈ ఏడాది కెపి ఉల్లికి మార్కెట్ లో మంచి డిమాండ్ ఏర్పడింది. గతంలో పండించిన పంటను అమ్మకం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ఈ ఏడాది పంట పోలాలోకి వ్యాపారులు వరుస కడుతున్నారు. నూర్పిడి చేసిన వెంటనే కొనుగోలు చేసి తరలిస్తున్నారు.

పొలాల వద్దకు దళారుల పరుగులు - క్వింటా రూ.9500 నుంచి రూ.10 వేలు

ప్రజాశక్తి-చాపాడు

కెపి ఉల్లి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది రూ.పది సంపాదించుకునే అవకాశం ఏర్పడింది. కొన్నేళ్లుగా పండించిన పంటను అమ్ముకునేందుకు మాత్రం నానా కష్టాలు పడాల్సి వచ్చేది. సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొంటున్నారు.విత్తనాలు కిలో రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు వెచ్చించి కొనుగోలు చేసి ఎకరాకు 23 కిలోల వంతున వినియోగించారు. ప్రస్తుతం నూర్పిడి చేసేందుకు రూ.10 వేలు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. గత నెలలో వర్షాలు పడటంతో ఉల్లిగడ్డలు కుళ్లి ఇబ్బందికరంగా మారి దిగుబడి మాత్రం తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. క్వింటా రూ.9500 నుంచి రూ.10 వేలు పలుకుతుండటంతో దళారులు కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. రాయలసీమకు విదేశీ మారక ద్రవ్యం తీసుకువచ్చే అతి పెద్ద పంట కెపి ఉల్లి. అలాంటి విదేశీ ఎగుమతులను కేంద్ర ప్రభుత్వం గతంలో నిషేధించడంతో అమ్మకానికి రైతులు నానా అవస్థలు పడేవారు. ఈ ఏడాది రైతులకు సమస్య తొలగిపోయినది. స్థానికంగా అమ్మకం చేయాలంటే ధళారులు నిర్ణయించినదే ధర. మైదుకూరు కేంద్రంగా జిల్లాలోని దువ్వూరు, బి.మఠం మండలాలతో

ఉల్లి పంటను నూర్పిడి చేస్తున్న కూలీలు

పాటు కర్నూలు జిల్లాలో సాగయ్యే ఉల్లికి పలు రోగాలను నయం చేసే గుణం కలిగి ఆరోగ్యప్రదాయినిగా పేరుగాంచినది. రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాలో సాగైన ఉల్లిపాయలకు ఈశాన్య ఆసియా దేశాలైన సింగపూర్, మలేషియా, దుబాయ్, హాంకాంగ్, శ్రీలంక దేశాలలో మంచి డిమాండ్ ఉంది. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై గతంలో నిషేధం విధించింది. ప్రస్తుతం నిషేధం ఎత్తివేయడంతో ధరలు బాగా ఉన్నాయి. మనదేశంలో వినియోగించే ఉల్లిపాయలకు, ఎగుమతుల అవసరాలకు పండించే ఉల్లిపాయలకు వ్యత్యాసం ఉంది. అందుకే ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించి కెపి ఉల్లి ఎగుమతులపై నిషేధం తొలగించినది. జిల్లాలో మైదుకూరు, దువ్వూరు ఇతర ప్రాంతాలలో ఈ ఏడాది 4వేల ఎకరాలలో ఉల్లి పంట సాగైంది. దాదాపుగా 15 వేల టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రైతులు ఉల్లి పంటను ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో సాగు చేయడం ఆనవాయితీ. ప్రారంభంలో క్వింటా కెపి ఉల్లి ధర రూ.8 వేలతో ప్రారంభమై ప్రస్తుతం రూ.10 వేల వరకు పెరిగాయి. సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. గతంలో రైతులు సంఘంగా ఏర్పడి మార్క్ఫెడ్ ద్వారా కెపి ఉల్లి కొనుగోలు చేయాలని నిరసనలు కూడా చేపట్టారు. గత ఏడాది మార్కెట్ యార్డ్ ద్వారా కొనుగోలు చేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతులు చేపట్టేలా సహకరించారు. మార్కెట్ యార్డు నుంచి గత రెండు సంవత్సరాల క్రితం 8055 క్వింటాళ్ళ కేపీ ఉల్లి కొనుగోలు చేశారు. మిగిలిన పంటను రైతులు దళారులకు అమ్ముకున్నారు.ఈ ఏడాది ధరలు ఉండటం తో వ్యాపారులు అధికంగా వచ్చి కొనుగోలు చేపడుతున్నారు.

శాశ్వత కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎకరా పొలంలో కెపి ఉల్లి పంట సాగు చేపట్టాను. దిగుబడి 20 క్వింటాళ్ళకు పైగా వచ్చింది. ధర రూ.9600 పలుకుతోంది. వర్షానికి పంట దెబ్బతింది. ఉల్లిగడ్డలు వర్షానికి తడిసి దెబ్బతిన్నాయి. దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉండేది. కెపి ఉల్లికి శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగం.

- సుబ్బరామిరెడ్డి, మనేరాంపల్లె, దువ్వూరు.

కెపి ఉల్లి ధరలు పర్వాలేదు

కెపి ఉల్లి పంటను నూర్పిడి చేపడుతున్నాం. అధిక వర్షాలకు పంట దిగుబడి తగ్గింది. ధరలు మాత్రం ఆశాజనకంగా ఉన్నాయి. దళారులు పంట పోలాలలనే ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు ఖర్చులు పోను రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తున్నది. కెపి ఉల్లి పంటను ఎన్నో ఏళ్లగా సాగు చేపడుతూ ఇబ్బంద్నులు ఎదుర్కొంటున్నాం. గత ఏడాది పంట అమ్మకం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు.

- వెంకటరెడ్డి, రైతు, చిన్నసింగనపల్లె.

తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలి

పీలేరు సబ్ జైలులో టిడిపి కార్యకర్తలకు చంద్రబాబు పరామర్శ

ప్రజాశక్తి-పీలేరు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పీలేరు సబ్ జైలులో ఉన్న సబ్‌జైలులో ఉన్న పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్ల మండలానికి చెందిన టిడిపి కార్యకర్తలను పరామర్శించడానికి సోమవారం చంద్రబాబు నాయుడు సబ్ జైలు వద్దకు చేరుకున్నారు. చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లి నుంచి బయలుదేరిన ఆయనకు దారి పొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు నీరాజనాలు పలికారు. పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి నుంచి సబ్ జైలు వరకు కూడా జనం తండోప తండాలుగా తరలివచ్చి బాబుకు బ్రహ్మరథం పట్టారు. వైసిపి తప్పుడు కేసుల కారణంగా సబ్ జైలులో శిక్ష అనుభవిస్తున్న టిడిపి కార్యకర్తలను పరామర్శించారు. అనంతరం జైలు బయట ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తన పర్యటన జరిగే ప్రతి చోటా పోలీసులు 30 యాక్టును ప్రయోగిస్తున్నారన్నారు. తాను మాట్లాడటానికి మైకు కూడా లేకుండా సీజ్ చేశారని ఆరోపించారు. వైసిపి గూండాలు ఈ నెల 6న టిడిపి ఫ్లెక్సీలు చింపేస్తే పోలీసులు ఏంచేస్తున్నట్లని ప్రశ్నించారు. తిరిగి వారు 7వ తేదీ కూడా అరాచకాలు సృష్టిస్తూ టిడిపి కార్యకర్తలను రెచ్చగొడుతూ మాట్లాడారని చెప్పారు. ఇరు పార్టీలను సమాన దృష్టితో చూడాల్సిన పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తూ 13 మంది పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారన్నారు. వారిలో 8 మందిని అరెస్టు చేసి కేసులో టిడిపికి చెందిన నాయకులను ఇరికించడానికి పేర్లు చెప్పాలంటూ పట్టుబడ్డ వారిని పోలీసులు నానా హింసలు పెట్టారని కూడా చెప్పారు. ఈ సందర్భంగా టిడిపి కార్యకర్తలు గాయడ్డారన్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలపై 10 తప్పుడు కేసులు పెట్టి వందల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలను జైల్లో పెట్టించారన్నారు. గత ఏడాది డిశంబరు 4న పారిశ్రామిక వేత్త రామచంద్ర యాదవ్ సదుంలో రైతుభేరీ నిర్వహించడానికి హైకోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నా స్థలం ఇవ్వకుండా, అదే రోజు రాత్రి 200 మంది వైసిపి గూండాలు అతని ఇంటిపై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. డిశంబరు 25న పెద్దిరెడ్డి పర్యటన సందర్భంగా తన ఇంటిపై బ్యానర్లు కట్టవద్దన్న న్యాయవాది నవీన్ కుమార్‌పై పెద్దిరెడ్డి గుండాలు వచ్చి దాడికి యత్నించారన్నారు. న్యాయవాది, అతని తండ్రిపై కేసులు నమోదు చేశారని తెలిపారు. ఈ నెల 2న చౌడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు రమేష్ కుమార్‌రెడ్డి తన ఇంటి ముందు వైసిపి తోరణాలు తొలిగించాలన్నందుకు 49 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పెట్టించారన్నారు. 2023 జనవరి 3న చౌడేపల్లి మండలం, బోడుకొండ గంగాపురంకు చెందిన టిడిపి కార్యకర్త రెడ్డిప్పకు చెందిన 1.5 ఎకరాల భూమి వైసిపి వారు హస్తగంతం చేసుకున్నారని చెప్పారు. ఇవే కాదు ఇంకెన్నో కేసులు పెట్టారనీ, పోలీసులను పహారా పెట్టి కోడి పందాలు నడుపుతున్నారని పేర్కొన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, విజయమ్మ, షర్మిల, జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలు చేశారన్నారు. వీరిలా తాము ఆలోచించి ఉంటే జగన్మోహన్‌రెడ్డి తిరిగి ఉండేవారు కాదన్నారు. పోలీసు తీరుపై కూడా తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, తంబళ్ళపల్లి మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్, టిడిపి జిల్లా అధ్యక్షులు పులివర్తినాని, ఎమ్ఎల్‌సి దొరబాబు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ శాసనమండలి చైర్మన్ ఎం.ఎ.షరీఫ్, రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాంప్రసాద్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కార్యదర్శి రిపేరు చేయించిన బోరు

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. ఈ నెల 12వ తేదీన 'అనంతంపల్లెలో తాగునీటికి ఇక్కట్లు' అనే శీర్షికతో కథనం వెలువడింది. ఈ వార్తకు స్పందించిన అధికారులు పంచాయతీ మోటార్‌ను రిపేరు చేయించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శివశంకర్ చొరవతో గ్రామంలో నీటి సమస్య లేకుండా సోమవారం మోటారును పునరుద్ధరించారు. ఈసారి కూడా పంచాయతీ కార్యదర్శి శివశంకర్ తన సొంత డబ్బుతో మోటార్‌ను రిపేరు చేయించారు. ఎన్నిసార్లు మోటారు రిపేరైనా పంచాయతీ కార్యదర్శి తన సొంత డబ్బు వినియోగించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి తమ ఊరు కాకపోయినా ఏ అధికారి గానీ, రాజకీయ నాయకుడు గానీ పట్టించుకోకపోయినా తన సొంత డబ్బుతో మోటారు రిపేరు చేయించి మంచినీటి కోసం తమ వంతు సాయం చేస్తున్నందుకు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పండుగ పూట ప్రజలు ఇబ్బందులు పడతారని, మంచినీటి కోసం వృద్ధులు, వికలాంగులు, పడుతున్న బాధలు చూచి పంచాయతీ కార్యదర్శి చలించిపోయి మోటారు రిపేరు చేయడం పట్ల గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

రాయచోటి: పట్టణానికి చెందిన మహమ్మద్ షావలి 15 నెలల కుమార్తె బ్రెయిన్ ట్రూమార్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకానాథ్‌రెడ్డి సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బెంగళూరు లోని సేయింట్ జోసెఫ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. మహమ్మద్ షావలి వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తన కుమార్తెకు ఆరోగ్యం బాగోలేదని, సాయం చేయాలని ద్వారకనాథ్‌రెడ్డికి ఫోన్‌లో సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి ఆర్థిక సాయం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-నందలూరు

దేశ భద్రత కోసం మన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి కొనియాడారు.ఆదివారం రాత్రి జాతీయ సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకొని అరవపల్లి పంచాయతీ కూడలి వద్ద అమ్మవారి శాల అధ్యక్షులు నరసింహస్వామి, జిల్లా వక్ఫ్ బోర్డు మైనార్టీ కార్యదర్శి సయ్యద్ అమీర్, రాష్ట్ర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి హిమగిరినాథ్ యాదవ్, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీం వైసిపి మండల మైనార్టీ కన్వీనర్ మన్సూర్ అలీఖాన్ ఆధ్వర్యంలో విశ్రాంత, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సైనికులకు ఏర్పాటు చేసిన సన్మాన సభలో ముఖ్యఅతిథిగా ఎంపిపి, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కుర్రా మణి, టీచర్స్ యూనియన్ అధ్యక్షులు అల్లం అశోక్ కుమార్ చేతుల మీదుగా సైనికులను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ దేశాన్ని, దేశ పౌరులను కాపాడటానికి వారి జీవితాలను సైతం త్యాగం చేసిన సైనిక వీరులను, దేశ భద్రత కోసం వారు చేస్తున్న సేవలను స్మరించుకుంటూ సైనికులను అభినందించడానికి నందలూరు మండలం వేదిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మైనుద్దీన్, వైస్ ఎంపిపి తుమ్మల భావన శ్రీధర్, విజయుడు, శ్రీధర్ గౌడ్, న్యాయవాది షేక్ మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

సైనికులను సన్మానిస్తున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ఆవును పూజిస్తున్న ఆలయ అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాగంగా సోమవారం కనుమ వేడుకలను మున్సిపల్ వైస్ చైర్మన్ పొలం రెడ్డి దశరథ రామి రెడ్డి, ఆలయ చైర్మన్ పొలం రెడ్డి విజయమ్మ అద్వర్యంలో నిర్వహించారు. పశుగ్రాశాన్ని, బెల్లం అన్నాన్ని పశువులకు తినిపించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ .మనవ మనుగడకు తోడూ నిడగా ఉంటూ పంటలు పండించేందుకు సహకరిస్తున్న పసువులను ప్రతి ఒక్కరు పుజించుకోవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఏడాదీ అలయ ప్రాంగణంలో అర్చకులు ,కమిటి సబ్యులుతో కలిసి ఆవులను అలంకరించి కనుమ పండుగా నిర్వహించారు. రేపు నెలలో నిర్వహించబోయే స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని చెప్పార. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు . కలెక్టర్, ఎమ్మెల్యే సహకారంతో 15సెంట్ల స్థలంలో 92 రూములు నిర్మాణాలనూ త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. వెండి రథాన్ని చేయించేందుకు ఏర్పాట్లు చేసామని అందుకు కావాల్సిన టెండర్లను కుడా సిద్ధం చేస్తున్నామన్నారు. ఆలయంలో నిత్యాన్నాదానం జరిగిందేకు సహకరించిన దాతలకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీ మిథునరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సహకరం అభినందనీయమం ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. **కలకడ:** సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలో పలు గ్రామాలలో సంక్రాంతి వేడుకలలో భాగంగా చిట్లకు ఏర్పాటు చేసి గోవులకు ఉన్న కొమ్ములను రంగులతో అలంకరించి సుందరంగా ముస్తాబు చేసి కాటమరాజు గుడిని ఏర్పాటు చేసే అక్కడ ఏర్పాటు చేసిన చిట్లాకుల వద్ద ఎద్దులను బెదిరించి సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. అనంతరం సోమవారం వాడవాడలా కనుమ పండుగను నిర్వహించారు. **నిమ్మనపల్లి:** సంప్రదాయానికి అర్థం పట్టే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలు బంధుమిత్రులతో కళకళలడాయి. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులపాటు అగ్రహారం, బండమీదపల్లి, నిమ్మనపల్లి, సామకోటవారిపల్లి, వెంగంవారిపల్లి, రెడ్డివారిపల్లి, రాచవేటివారిపల్లి తదితర గ్రామాలలో యువతి, యువకులు ఐకమత్యానికి నిదర్శనమైన చల్లను సేకరించి సంబరాలు చేసుకుంటూ సమీపంలోని నది జలాలలో గంగాదేవికి సమర్పించారు. వ్యవసాయ రంగంలో రైతులకు సహాయపడే గోమాతలను సుందరంగా అలంకరించి పూజలు చేసి కనుమ పండుగను జరుపుకున్నారు. కొత్త ధాన్యాల దిగుబడితో, పశు సంపద వృద్ధితో రైతులు సంతోషంగా రాణించాలని ప్రజలు ఆకాంక్షించారు.

కలకడ : ఎడ్లను సుందరంగా ముస్తాబు చేసిన ప్రజలు

ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు

క్రికెట్ టోర్నమెంట్ విజేత అర్షద్ జట్టు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడ మైదానంలో గత వారం రోజులుగా రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజు ఆర్థిక సహకారంతో మండల మాజీ టిడిపి అధ్యక్షులు సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న: హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్లో అరవ పల్లెకు చెందిన హర్షద్ లెవెల్స్ జట్టు విజేతగా నిలిచి రూ.30 వేల నగదు, ట్రోఫీని రాజంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్ చేతుల మీదుగా అందుకున్నారు. రన్నర్స్‌గా కుమ్మరిపల్లె లెవెల్స్ జట్టు రూ.20 వేల నగదు, ట్రోఫీను అందుకున్నారు. బబ్లు 50 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు. కార్యక్రమంలో నాయకులు పోతురాజు మస్తానయ్య, తాటి సుబ్బరాయుడు, శివశంకర్, ఉమామహేశ్వర్, కుర్రమని పాల్గొన్నారు.

పుంగనూరులో పెద్దిరెడ్డి రాజ్యాంగం నడుస్తోంది

ప్రజాశక్తి-ములకలచెరువు

పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని టిడిపి తంబళ్లపల్లె నియోజకవర్గ బాధ్యుడు శంకర్ యాదవ్ ఆరోపించారు. సోమవారం పీలేరులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కలిసిన అనంతరం మదనపల్లిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివుడి మాలవేసిన పెద్దిరెడ్డి చేసేవన్నీ అక్రమాలేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి ప్రభంజనాన్ని అడ్డుకోలేక అనవసర ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. శివశక్తి డైరీ పేరుతో ఇతర డైరీల ఆర్థిక మూలాలు దెబ్బ తీస్తున్నారని తెలిపారు. గ్రానైట్ యేజమానులను బెదిరించి కప్పం కట్టించుకుంటున్నారని ఆగ్రహించారు. పుంగనూరు నియోజకవర్గంలో మూడున్నరేళ్లలో 300 మంది టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు, 60 మందిపై హత్యాయత్నం, 40 మందిపై అట్రాసిటీ కేసులు బనాయించిన ఘనుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని తెలిపారు. టిడిపి జ్వరం పట్టుకొని పోలీసులతో నాటకాలాడిస్తున్నారని పెర్కొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

రాజంపేట అర్బన్ : ప్రముఖ విద్యావేత్త, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు సహకారంతో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శ్రీ మారమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంట్ మందపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్ విజేతలుగా చెర్లోపల్లి క్రికెట్ టీం నిలిచింది. గెలిచిన చెర్లోపల్లి టీంకు రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్ చేతుల మీదుగా ప్రథమ బహుమతిగా రూ.35 వేలు నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేశారు. రన్నర్స్‌గా నిలబడిన మందపల్లి టీంకు రాజంపేట తెలుగుదేశం పార్టీ యువ నాయకులు రాము యాదవ్ చేతుల మీదుగా ద్వితీయ బహుమతిగా రూ.20 వేలుతో పాటు జ్ఞాపికను అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా రూ.వెయ్యి సుధాకర్‌కు, మ్యాన్ ఆఫ్ ది సీరియస్‌గా సుధీర్‌కు జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో మందపల్లి గ్రామ ప్రజలతో పాటు, ఇరుజట్లు పాల్గొన్నాయి. ఆర్గనైసర్స్ నరహరి, బాలకృష్ణతో పాటు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మహమ్మద్ సోహెల్, తులసి నాగేంద్ర, శివకుమార్ పాల్గొన్నారు.

విజేతలకు ట్రోఫీ కప్ అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రమాదానికి గురైన మంత్రి, ఎంపీకి చెందిన వాహనం

మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా రాయచోటి మండలంలోని చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలకు తృటిలో ప్రమాదం తప్పింది. సోమవారం బంధువుల ఇంటికి వెళుతుండగా కాన్వాయ్‌లోని మిథున్‌రెడ్డికి చెందిన వాహనాన్ని మరో కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఆ వాహనం పల్టీలు కొట్టింది. వాహనంలో ప్రయాణిస్తున్న ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి, భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులంతా సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు పుంగనూరు నుంచి వీరబల్లిలోని అత్తగారింటికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంత్రి పెద్దిరెడ్డి వాహనంలోనే ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి కూడా ఉండటంతో వాళ్లకు ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన సంఘటన పిటిఎం మండలంలో సోమవారం చోటు చేసుకుంది. అటవీశాఖ సిబ్బంది కథనం మేరకు.. పిటిఎం మండలం పులికల్లు పంచాయతీ కమ్మవారిపల్లె సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జింక తీవ్రంగా గాయపడిన అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు గమనించి ములకలచెరువు అటవీ శాఖ సిబ్బంది సమాచారం అందించారు. అటవీశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన జింకకు స్థానిక కనుగొండ అటవీ ప్రాంతంలో ఖననం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది సుధాకర్, గోపాల్, హనుమంతురాయ్ పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు పి.సి.యోగేశ్వర్‌రెడ్డి పేద ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు హర్షనీయమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. తాళ్లపాక గ్రామ పంచాయతీలో యోగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసంలో పేద ప్రజలకు దుస్తులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఇష్టమైన పండుగ సంక్రాంతి అన్నారు. ఈ పండుగను పేద ప్రజలు కూడా సుఖ సంతోషాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు పేద ప్రజలకు యోగేశ్వర్ రెడ్డి దుస్తులు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సొంత ఊరిపై ఉన్న మమకారంతో పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుకోవడం జరుగుతుందన్నారు. సంక్రాంతి పండుగ రోజున సుమారు 100 మంది మహిళలకు చీరలు, పురుషులకు పంచలు పంపిణీ చేయడం సేవకు ప్రతిరూపమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శంకర్, ఎంపీటీసీ మధుసూదన్, వైసిపి నాయకులు బాలరాజు అర్జున్ రాజు, శేఖర్ రాజు, మధుసూదన్ రెడ్డి, సాంబ రాజు, శివారెడ్డి, ప్రభాకర్ నాయుడు, వై రాజశేఖర్ రాజు, భాస్కర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రాజు, గంగయ్య, బాలరాజు, అనిల్ కుమార్ రాజు, వరదారెడ్డి, నాగేశ్వరరావు, అంజి, బాలరాజు సుబ్బరాజు, గాడే సుబ్బరాజు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మేడా, యోగేశ్వర్‌రెడ్డి

విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న కృష్ణారెడ్డి

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని భయనేని దళితవాడ, వెంకట రెడ్డిగారిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లు సోమవారం పొదుకూరుపల్లిలో రెస్కో మాజీ చైర్మన్ సదిపిరాళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ రవిశంకర్‌రెడ్డి స్వగృహంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన కంప్యూటర్ ప్రింటర్లు, శంకర్ నారాయణ డిక్షనరీలు, విద్యా సామగ్రిని అందజేశామన్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు సైకిళ్లు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మదర్ ఆస్పత్రి డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, డాక్టర్ పద్మజా, మృదుల హాస్పిటల్ డాక్టర్ మృదుల, డాక్టర్ కమలాకర్ రెడ్డి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర రాజు, నరసిం హులు, వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పొట్టిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండపై భక్తుల సందడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని మల్లయ్య కొండపై వెలసిన భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మొక్కలు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మల్లయ్య కొండ చైర్మన్ కె.ఆర్ మల్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవస్థానం తరపున భక్తులకు ఉచిత అన్న సంతర్పణ చేశారు. **నేడు అన్నదాన కమిటీ సమావేశం:** స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు మల్లయ్య కొండ అన్నదాన కమిటీ సమావేశం జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు విజయ భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి తెలిపారు. రానన్న మహాశివరాత్రి సందర్భంగా మల్లయ్య కొండకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు కార్యక్రమాలు నిర్వహణ బాధ్యతలు విధుల సమీకరణ తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. కమిటీ సభ్యులు భక్తులు పాల్గొని పలసూచనలో సలహాలు ఇవ్వాలని కోరారు.

అలంకరణ తొడుగును అందిస్తున్న దాతలు విజయలక్ష్మి, సుధాకర్

ఆలయానికి అలంకరణ తొడుగు వితరణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీనేలమల్లేశ్వరస్వామికి అలంకరణ తొడుగును మదనపల్లి మిట్స్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మి, ఆమె భర్త సుధాకర్ సోమవారం అందించినట్లు ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.72 వేలు విలువైన పంచలోహ అలంకరణ తొడుగును స్వామివారికి వితరణ చేసినట్లు పేర్కొన్నారు. ఆలయ అర్చకులు శంకర శాస్త్రి, శివా స్వామి దాతలకు తీర్థ ప్రసాదాలు అందించి, ఆశీర్వదించారు.

నేడు వాహనాలకు వేలం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. వాహనాల వేలంలో పాల్గొన దలచిన వారు పోలీస్ స్టేషన్లో ముందుగానే సంప్రదించి రూ.వెయ్యి చెల్లించి పేరు నమోదు చేసుకుని సభ్యత్వం పొందాలన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే బహిరంగ వేలం డీఎస్పీ కేసప్ప సమక్షంలో జరుగుతుందని చెప్పారు. వాహనాలు దక్కించుకున్నవారు జీఎస్టీ చెల్లించాలన్నారు.

విందులో స్వయంగా వడ్డిస్తున్న మేడా మల్లికార్జునరెడ్డి

ముస్లిములకు ఎమ్మెల్యే 'మేడా' విందు

రాజంపేట అర్బన్ : ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జున్ రెడ్డి ఇంట సోమవారం కనుమ పర్వ దినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలో ఉన్న ముస్లింల సోదరులకు విందు ఏర్పాటు చేశారు. సుమారు 2500 మందికి షడ్రుచులతో విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని ఆత్మీయ విందు అతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. మైనారిటీలంటే సోదర, ప్రేమాభిమానం కలిగిన వ్యక్తి మేడా అని ముస్లిం సోదరులు కొనియాడారు. అనంతరం మేడా, ఎం.ఆర్.కె.ఆర్ అధినేత మేడా రఘునాథ్‌రెడ్డి, సిద్ధవటం ఇన్‌ఛార్జి మేడా మధుసూదన్ రెడ్డి, నందలూరు మండల ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గానికి చెందిన ముస్లిం నాయకులు, వైసిపి ముఖ్య నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీని కలిసిన కెకె.రెడ్డి

రాజంపేట అర్బన్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం కనుమ పండుగ రోజున విందుకు ఆహ్వానించడంతో వీరబల్లికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డిని అమెరికా ఆటా కన్వెన్షన్ డైరెక్టర్ కెకె.రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం వీరబల్లి ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డితో కలిసి అమెరికాలో తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వీరి వెంట సుబోధ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీకి పూలబోకే ఇస్తున్న కెకె.రెడ్డి

మురుగునీటితో అవస్థలు

- రోగాల పాలవుతున్న ప్రజలు.. డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న ఖాళీ స్థలం

రోడ్లపై పారుతున్న నీరు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డులోని ఏరువాక గంగమ్మ దేవాలయ పరిసర ప్రాంతంలోని ఇళ్ల మధ్యలో మురుగునీరు నిలుస్తోంది. ఈ క్రమంలో స్థానికులు రోగాలు ప్రబలుతాయని భయాందోళనకు గురవుతున్నారు. 11వ వార్డు వీధుల్లో మురుగు నీటి కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వృథా నీరు రోడ్ల వెంబడి ప్రవహిస్తోంది. నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో నీరు నిలుస్తోంది. ఆ నిల్వ కొద్ది రోజులకు మురుగునీరుగా మారి దోమలకు, క్రిమికీటకాలకు, పందులకు ఆవాసంగా మారింది. ఈ ప్రాంతంలో చాలామంది చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరు పనుల నిమిత్తం బయటకు వెళ్లే సమయానికి మునిసిపాలిటీకి సంబంధించిన చెత్త సేకరణ కార్మికులు రాకపోవడంతో ఆ చెత్తను స్థానికులు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో వేస్తున్నారు. అక్కడ చెత్త రోడ్లు వెంబడి పేరుకుపోయింది. మురుగునీరు, చెత్త వలన పరిసర ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని, ఇళ్లలో ఉండలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. చెత్త డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. అక్కడ ఉన్న మురుగు నీరు, చెత్త వలన దోమల బెడద ఎక్కువైందని వాటి వలన విష జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఏడాది క్రితం ఇదే సమస్యతో నాయకులను, అధికారులను కలిసినప్పుడు నూతన సిసి రోడ్లు నిర్మాణం చేపట్టి, రోడ్డుపై పారుతున్న నీటిని వలసపల్లి రహదారిలోని ప్రధాన కాలువలోనికి పోయేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని స్థానికులు తెలిపారు. అయినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కాలువ వీధి దిగువన ఉన్నప్పుడు రోడ్లు ఎగువ నుండి దిగువకు వేయాలి.. కానీ దిగువ నుండి ఎగువకు ఎలా వేస్తారని అధి కారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాయకులు, అధికారులు ఈ సమస్యపై స్పందించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకున్నాం..

మురుగునీరు, చెత్త వలన దుర్వాసన వస్తోంది. వర్షాకాల సమయంలో వాసన భరించలేకపోతున్నాం. దానికి తోడు రోడ్ల వెంబడి నీరు ఎప్పుడూ పారుతూనే ఉంటుంది. ఈ సమస్యపై పరిష్కారం చూపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మల్లేష్, స్థానికుడు

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్యం మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక జిన్నారోడ్డులో ఆధునీకరించిన 'ఆర్నాల్డ్‌జిమ్ పాయింట్'ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. అప్పుడే అవసరమైన సమయంలో మంచి నిర్ణయాలు తీసుకోగలడని ఆయన పేర్కొన్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో జిమ్ పాయింట్‌ను నిర్వహిస్తున్నారన్నారు. జిమ్ పాయింట్ యజమాని న్యూ ఆంధ్ర బాడీ బిల్డింగ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ న్యామతుల్లా మాట్లాడుతూ యువత నిస్తేజంగా ఉండడం దేశానికి మంచిది కాదన్నారు. యవత ఉత్సాహంగా ఉంటూ మంచి నిర్ణయాలు తీసుకొని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. ఇందుకు ఆరోగ్యంగా ఉండడం చాలా ముఖ్యమన్నారు.

జిమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామశాలను ఆదునీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

కమణీయం.. కల్యాణోత్సవం

ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని, తిరుపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని చియ్యపాడు గ్రామంలో జనమేజయ మహారాజుచే ప్రతిష్టించబడిన పురాతన దేవాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ కళ్యాణం నిర్వహించారు. ధర్మకర్త మండలి చైర్మన్ మహానందిగారి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఎస్.రఘురామి రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు, చైర్మన్ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని, తిరుపాల్‌రెడ్డిని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాత్యాయని కన్స్ట్రక్షన్స్ ఎండి పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి టి. లక్ష్మయ్య, జడ్‌పిటిసి భర్త శాంతరాజు, ఇకెఆర్ ట్రస్ట్ చైర్మన్ కార్తిక్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షల వితరణ

చాపాడు : మండలంలోని చియ్యపాడు చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి పలువురు రూ.3 లక్షలు వితరణ చేశారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణంలో విశ్వనాథపురం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కార్తీక్‌రెడ్డి రూ.రెండు లక్షలు, ఖాజీపేట మండలం అచ్చనపల్లెకు చెందిన ప్రదీప్‌రెడ్డి రూపంలో మరో రూ.లక్ష ఆలయ చైర్మన్ మహానందిగారి నిరంజన్‌రెడ్డికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సన్మానించారు. ఆర్థికసాయం చేసినందుకు ఆలయ చైర్మన్ అభినందనలు తెలిపారు.

దాతలను అభినందిస్తున్న ఆలయ చైర్మన్

ఉత్సాహంగా పార్వేట ఉత్సవం

ప్రజాశక్తి - మైదుకూరు

సంక్రాంతి పండుగలో భాగంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మాధవరాయ స్వామి నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూలతో పార్వేట ఉత్సవాన్ని దేవస్థానం చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు ప్రారంభించారు. బాణ సంచా పేలుస్తూ, మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, కేరళ నాట్య బృందాలతో కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా ప్రారంభమైంది. డిజె సౌండ్ సిస్టమ్‌తో యువకులు కేరింతలు కొడుతూ పాల్గొన్నారు. మైదుకూరులో ప్రారంభమైన ఈ ఉత్సవం సరస్వతిపేట, సర్వాయిపల్లె, పాతపాలెం, పార్వతీనగరం, మామిళ్లపల్లె, వెంకటాపురం, యాపరాపల్లి మీదుగా కొనసాగుతుంది. పెద్ద ఎత్తున మహిళలు, ప్రజలు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు.

గ్రామోత్సవంలో మాధవరాయస్వామి

ఊరేగింపులో శ్రీ మాధవరాయ స్వామి

చాపాడు : సంక్రాంతి పండగ ముగింపు సందర్భంగా సోమవారం గ్రామాల్లో పార్వేట ఉత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామి, వెదురూరు పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి, చియ్యపాడు చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, గ్రామోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, భజనలు ఆకట్టుకున్నాయి. గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. చిత్రకారుడు చెన్నకేశవస్వామి మండల పరిధిలోని బసిరెడ్డిపల్లె, రేపల్లె, సిద్ధారెడ్డిపల్లెలో గ్రామోత్సవం నిర్వహించారు. విశ్వనాథపురం గ్రామంలో ఇకెఆర్ ట్రస్ట్ చైర్మన్ కార్తిక్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహూమతులు అందజేశారు.

ప్రారంభానికి నోచని పశు వైద్యశాల

- ఆధునిక హంగులతో నిర్మాణం.. బిల్లులు రాలేదనే నెపంతో పశువులకు అందని వైద్యం

నిర్మాణం పూర్తయిన పశువైద్యశాల నూతన భవనం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని పశువైద్యశాలకు సంబంధించిన నూతన భవనం చిన్నచిన్న పనులు మినహా పూర్తయి ఏడాది దాటిన ప్రారంభానికి నోచుకోలేదు. వివరాల్లోకి వెళితే.. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి ప్రభుత్వ పశువైద్యశాలకు నూతన భవనాన్ని కేటాయించారు. దాదాపు రూ.60 లక్షలతో ఈ నూతన భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ నూతన భవనంలో ఆధునిక ల్యాబ్, రైతు సదస్సులు నిర్వహించుటకు సభాస్థలి, వైద్యులకు ప్రత్యేక గది, రోగనిరోధక మందులు సరఫరా చేయు గది వంటి ఆధునిక హంగులతో 2021లోనే పూర్తయింది. అయితే సదరు భవన నిర్మాణ కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకపోవడంతో భవనాన్ని పశువైద్య అధికారులకు అప్పగించలేదని సమాచారం. బిల్లులు చేయాలంటే మిగిలిన చిన్న చిన్న పనులను కూడా పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను పశువైద్య అధికారులు కోరినట్లు సమాచారం. కానీ బిల్లులు ఇస్తే గాని మిగిలిన పనులు చేయలేమని కాంట్రాక్టర్ ససేమిరా అన్నట్లు తెలిసింది. ప్రస్తుత నాయకులు ఈ నూతన భవనం ప్రారంభోత్సవానికి సంబంధించిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి. ఈ పశు వైద్యశాల ప్రారంభిస్తే, దాన్ని కేటాయించిన వారికి మంచిపేరు వస్తుందనే ఆలోచనలో ప్రస్తుత నాయకులు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఇక్కడ పశువైద్య సిబ్బంది కొరత ఉంది. సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఏదేమైనా రైతులకు మేలు కలిగేలా పశువైద్యశాలపై రాజకీయాలు మాని భవనాన్ని ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

రైతు సదస్సులు నిర్వహించలేకున్నాం



ప్రస్తుత పశువైద్యశాల భవనం పాతది కావడంతో రైతు సదస్సులు నిర్వహించుటకు సరైన గదుల్లేవు. రైతు సదస్సులు నిర్వహించలేకున్నాం. నూతన భవనంలో రైతు సదస్సుల కోసమే ప్రత్యేక గదులు నిర్మించారు. అధికారులు చొరవ చూపి త్వరగా నూతన భవనాన్ని పశువైద్యశాలకు అప్పగించాలని కోరుకుంటున్నాం.

-రమణయ్య, పశువైద్యులు, ఎర్రగుంట్ల

ర్యాలీగా వెళుతున్న జయరామ నాయుడు

కార్యకర్తలకు అండగా ఉంటాం : జయరాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇటీవల పుంగనూరు నియోజకవర్గం, రొంపిచర్ల మండలంలో చోటుచేసుకున్న ఘర్షణలో భాగంగా అధికార వైసిపి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పీలేరు సబ్ జైలుకు తరలించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పీలేరు సబ్ జైలుకు వెళ్లి ములాకత్ నిర్వహించారు. మదనపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీరామినేని జయరామ నాయుడు సుమారు 100 వాహనాలతో పీలేరు వెళ్ళి, పట్టణంలో కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి చంద్రబాబుతో కలిసి జైల్లో ఉన్న టిడిపి కార్యకర్తలను పరామర్శించారు. ఈ ర్యాలీతో శ్రీరామినేని అధినేత చంద్రబాబు దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా శ్రీరామినేని జయరామ నాయుడు మాట్లాడుతూ అధికార పార్టీ దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు రోజురోజుకు మితిమీరిపోతున్నాయన్నారు. వైసిపి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. దాడులు విధ్వంసాలకు పాల్పడేది అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలయితే పోలీసులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలుపైన కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధినేత చంద్రబాబు, పుంగనూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ చల్లా బాబుతో కలిసి కార్యకర్తలను పరామర్శించి వారికి ధైర్యం కల్పించడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అధైర్యపడవద్దని, ఎంత కష్టమొచ్చినా పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో చికలుబైలు సర్పంచ్ ప్రభాకర్ ఎంపీటీసీ చలపతి నందకుమార్ శ్రీనివాసులు టిడిపి రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటరమణ, టిడిపి నాయకులు పెంచుపాడు స్వామి, ముద్దుకృష్ణమ, పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుమతులు అందుకుంటున్న విజేతలు

విజేతలకు బహుమతులు

రాయచోటి: సంక్రాంతికి పండుగను పురస్కరించుకుని రాయచోటి మున్సిపాల్టీ పరిధిలోని 30వ వార్డులోని ఎగువ అబ్బవరం హరిజనవాడలో అంబేద్కర్ యువసేన అధ్యక్షులు అబ్బవరం శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్న మెంటులో విజేతలకు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు సోమవారం బహుమతుల ప్రదానం చేశారు టోర్నమెంట్‌లో నాలుగు టీములు పాల్గొని ఉత్సాహంగా ఆడాయి. ఇందులో ధోని -11 గ్రూపు గెలుపొందారు. గెలుపొందిన వారికి మెమెంటుతో పాటు నగదు , ఆల్ రౌండర్‌గా ప్రతిభ కనబరిచిన అబ్బవరం తేజ, బెస్ట్ బౌలర్‌గా అబ్బవరం ఆది, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఉప్పులూరు కిరణ్ కుమార్ తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు కార్యక్రమంలో బిఎస్‌పి అధ్యక్షులు ఏ యుగంధర్, దళిత నాయకులు వి.వెంకటరమణ, ఎ.నారాయణ, ఎ. శ్రీనివాసులు, రెడ్డయ్య, ఉప్పులూరు వెంకటరమణ హరి పాల్గొన్నారు.

మేడా అభిమానికి ఆర్థిక సాయం

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె రజక వీధికి చెందిన అభిమాని వైసిపి కార్యకర్త జూటూరు ఆంజనేయులుకి పక్షవాతం సోకి కొద్ది రోజులుగా మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర నాయకులు మేడా విజయ శేఖర్ రెడ్డి రూ.పది వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీకి గాని ఆసుపత్రికి ఖర్చులకు గాను రూ.లక్ష వరకు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ఎటువంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే సహాయ సహకారాలు ఆంజనేయులు కుటుంబానికి అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మస్తానయ్య, ధనుంజయ నాయుడు, రమేష్ రెడ్డి, విజయుడు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న మేడా విజయ్ శేఖర్ రెడ్డి

క్రైం కార్నర్

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రామసముద్రం

కళాశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపిన సమాచారం మేరకు...రామసముద్రం మండలం ఊలపాడు గ్రామానికి చెందిన కనగాని శ్రీనివాసులు కుమార్తె కె.గాయత్రి పుంగనూరు ఎంసివి కాలేజిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రతి రోజు ఉదయం కళాశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండేది, ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన ఉదయం గాయత్రి ఇంటి నుండి కళాశాలకు బయల్దేరి వెళ్లింది. తరువాత తిరిగి ఇంటికి రాలేదని, చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకి తెలియలేదని సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళపై దాడి

ప్రజాశక్తి తంబళ్లపల్లి

భూముల విషయమై ఓ మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. బాధితురాలు నాగమనమ్మ ఫిర్యాదు మేరకు... కోటకొండ గ్రామం ఎగువ తాండాకు చెందిన నాగమనమ్మ తమ భూమికి ఆనుకొని ఉన్న డికెటి భూమిలో అదే గ్రామానికి చెందిన శకుంతలమ్మ కుమారుడు రాజ్ కుమార్ జెసిబితో సదులు చేసేందుకు ప్రయత్నించగా నాగమనమ్మ అడ్డుకుంది. ఆగ్రహించిన శకుంతలమ్మ కుమారుడు రాజ్ కుమార్, సరోజమ్మ కొడుకు రవీంద్ర నాయక్ దాడి చేశారు. విచక్షణ రహితంగా కొట్టడంతో నాగమణిమ్మకు గాయాలయ్యాయి. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లిలో అక్రమంగా నిషేధిత నాటు సారా విక్రయిస్తున్న ఓ యువకున్ని సోమవారం వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ హరిహర ప్రసాద్ కథనం మేరకు.. మదనపల్లి మండలం నారమాకుల తండాకు చెందిన బాలాజీ నాయక్(26), సారా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఐదు లీటర్ల సారాతో పాటు నిందితుని అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ అనంతరం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.